

# కథా కౌముది

## బొజ్జ గణపతి నవ్వాడు!

ఆర్.సి. కృష్ణస్వామి రాజు

అద్దం ముందర కూర్చుని కొయ్య దువ్వెనతో తల దువ్వుకుంటోంది శశికళ. రెండు తెల్ల వెంట్రుకలు కనిపించాయి. ఏడుపు ముఖం పెట్టింది. చిన్నగా వాటిని పెరికి గబగబా పెరట్లోకి వెళ్ళింది. మునగ చెట్టు కింద చిన్న గుంత తవ్వింది. దానిలో పూడ్చి పెట్టింది ఆ తెల్ల వెంట్రుకల్ని.

“ఎవరు చెప్పినారే తిక్కపిల్లా నీకు? తెల్ల వెంట్రుకల్ని పూడ్చి పెడితే మళ్ళీ మళ్ళీ రావని.

నీకు తెలియకనే నీ తల ‘నేను పండిపోతున్నాను!’ అని చెబుతోంది. మునక్కాయ ముదిరినా, బెండకాయ ముదిరినా దేనికీ పనిరావని తెలుసుకో!” అని అమ్మ సుబ్బులక్క గట్టిగట్టిగా అరిచింది.

అవేమీ చెవిలో వేసుకోలేదు శశికళ.

నేరుగా వెళ్ళి టీవీ ముందర కాలు మీద కాలేసుకుని కూర్చుంది.

టీవీ లో సినీనటి రమ్యకృష్ణ దంపతుల ఇంటర్వ్యూ వస్తోంది. కుర్చీలో నుంచి ముందుకు జరిగి చూస్తోంది శశికళ.

‘రమ్యకృష్ణకు మంచి మొగుడు దొరికినాడు... కృష్ణ వంశీ’ అనుకుంది.

ఇంతలో కరెంటు పోయింది. పక్కనున్న వార పత్రిక పేజీలు తిప్పసాగింది.

అందులో మణిరత్నం, సుహాసినీల ఇంటర్వ్యూ ఉంది.

‘సుహాసినికి అందమైన మొగుడు దొరికినాడు’ అనుకుంది.

పుస్తకం పక్కన పడేసింది.

‘ అందరికీ మంచి మంచి మొగుళ్ళు దొరుకుతున్నారు. నాకు ఎందుకు దొరకడం లేదో...

మన ఊర్లోని పదో తరగతి ఫెయిల్ అయిన కుసుమ అమెరికాలో ఉంది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ మాత్రమే చదివిన ఇందిర సింగపూర్ లో ఉంది. ప్చ్...ప్చ్...’ అని బాధగా నోరు చప్పరించింది.

xxxxxx

ఇంటిముందర చెరుకు గడలను కణుపులు చూసి కత్తితో ముక్కలు చేస్తోంది సుబ్బులక్క.

ఇంట్లోని పిల్లులతో ఆడుకుంటోంది పెద్ద కూతురు శశికళ.

దాన్ని చూసిన సుబ్బులక్క 'ఇదేమి ఖర్మ. చక్కగా పెండ్లి చేసుకుని పిల్లలతో ఆడుకోవాల్సిన నువ్వు పిల్లులతో ఆడుకుంటున్నావు.

పన్నెండేళ్ళకు పైట వేసినావు. పైట వేసి పదహారు ఏండ్లయినా పెండ్లి చేసుకోకుండా దిబ్బ మాదిరి ఇంట్లో కూర్చుని ఉన్నావు . నీ క్లాస్ మెట్ ల పిల్లలు పైటలేసి తిరుగుతున్నారు. ఇంకా రోషం రాలేదా నీకు?

కాలికాడికి వచ్చిన ప్రతి సంబంధానికీ ఏదో ఒక సొట్ట చెబుతావు . 'పొట్టిగున్నాడు, నల్లగున్నాడు, అత్తకు దొర్రి పళ్ళు, మామకు బట్ట తల...' అదీఇదీ చెప్పి అడ్డం పడుతావు" నిష్టూరపోయింది సుబ్బులక్క.

"నాకేమి తక్కువ? మంచి హైట్ ఉన్నాను, వెయిట్ ఉన్నాను, ఎర్ర గులాబీల రంగు ఒళ్ళు, చూడ చక్కని కళ్ళు. ఎవడో ఒకడు వస్తాడు. ఎగరేసుకు పోతాడు.

ఈ నాలుగు ఊళ్ళల్లో ఇంటర్ చదివిన దానను. నా రేంజికి తగ్గవాడు ఈరోజో రేపో వస్తాడు. 'పడి చస్త నీ కాళ్ళ కాడ' అని పాడుతాడు చూడు" అని ఆత్మవిశ్వాసంతో చెప్పింది.

"నువ్వు ఐశ్వర్యారాయ్ అంత అందగత్తెవేనే తల్లీ... ఏ రాయికైనా ఇంకో తోడు రాయి ఉండాలి. నీకు దణ్ణం పెడుతానే తల్లీ... వచ్చే ఆదివారం ఒంటిమిట్ట సంబంధం వాళ్ళు వస్తామంటున్నారు. పెద్ద రైతులు వాళ్ళు... నిన్ను పూలల్లో పెట్టి చూసుకుంటామన్నారు. పైసా కట్నం వద్దన్నారు. పెళ్ళి కూడా వాళ్ళే చేసుకుంటామన్నారు.

ఏమి అనుకుందో ఏమో... శశికళ "సరే రమ్మను!" అని చెప్పింది.

ఆనందంతో సుబ్బులక్క చెరుకు గడ ముక్కలన్నీ కసకసా నమిలేసింది.

గబగబా పోరుమామిళ్ళ లో ఉండే పెద్ద కూతురు చెంచులక్ష్మికి ఫోన్ చేసింది. పెండ్లి నిర్ధారణ అయితే కువైట్ లో ఉండే మొగుడికి చెబుదామనుకుంది.

xxxxxx

పెళ్ళి చూపుల రోజు–

ఆటో లో దిగినారు పెండ్లికొడుకు వెంకట సూర్యుడితో పాటు వియ్యంకులు.

శశికళ అక్క చెంచులక్ష్మి, బావ నల్లమరాజులు మరువం ఆకులిచ్చి ఆహ్వానం పలికినారు.

కొత్త మనుషులు ఇంట్లోకి వచ్చేసరికి పిల్లి 'మ్యావ్' అని అరిచింది.

"మీరు పిల్లుల్ని పెంచుతారా?" అని అడిగింది పెండ్లికొడుకు అమ్మ.

"అవును. మీరు పెంచరా?" అని ఎదురు ప్రశ్న వేసింది సుబ్బులక్క.

“మేము అడవి పిల్లులను పెంచుతాము!’” అని బదులిచ్చింది పెండ్లికొడుకు అమ్మ.

పెండ్లి కూతుర్ని తీసుకొస్తూ సుబ్బులక్క “మేము మంచోళ్ళం. మా బిడ్డలు ఇంకా మంచోళ్ళు” అని చెప్పింది.

‘మేమేమీ తీసిపోము’ అన్నట్లుగా పెండ్లికొడుకు అమ్మ “మేము బంగారు గుట్టలం. మా బిడ్డలు బంగారు కొండలు” అని చెప్పింది.

‘దొందూ దొందే’ అనుకున్నారు అక్కడికి వచ్చిన మైకు నోరు మునిలక్ష్మి, పదిమంది పిల్లల్ని కన్న పార్వతక్క,.

పెండ్లి కొడుకు, పెండ్లి కూతురు ఒకరినొకరు చూసుకున్నారు.

ప్లేటులో పెట్టిన ఉల్లిపాయ పకోడీ భలే ఉందని పొగిడినాడు పెండ్లికొడుకు.

పకోడీ చేసిన సుబ్బులక్క మనసు గాలి బెలూన్లు భుజానికి కట్టుకున్నట్లు పై....కి ఎగిరిపోయింది. అల్లుడి మెప్పు పొందిన అత్త సుబ్బులక్క మరింత పకోడీ తెచ్చి ప్లేటులో పెట్టింది.

‘ఎక్కువ తినబాకురా కొడుకా... శెనిగ పిండి, నీకు జీర్ణం కాదు’ అని చూపుల్తోనే చెప్పింది పెండ్లికొడుకు అమ్మ.

‘అలాగే’ అన్నట్లుగా తలని బుద్ధిగా ఆడించి నోరు కట్టడి చేసుకున్నాడు పెండ్లికొడుకు.

ఒకర్ని ఒకరు దొంగ చూపులు చూసుకుంటున్న పెండ్లి కొడుకు, కూతుళ్ళను “మీరేదైనా మాట్లాడుకోవాలనుకుంటే అలా పెరట్లోకి వెళ్ళి మాట్లాడుకోండి” అని చెప్పినారు పెళ్ళి పెద్దలు.

‘ఎప్పుడెప్పుడా...’ అని ఎదురుచూస్తున్న వెంకట సూర్యుడు పంచె ఎగ్గట్టి సరసరా పెరట్లోకి వెళ్ళినాడు. వెనకనే వెళ్ళింది శశికళ. ఇద్దరూ పనస చెట్టు కింద బండ మీద కూర్చున్నారు.

వారి ఏకాంతానికి అడ్డు రాకూడదని చెట్టు మీది పిచ్చుకలు రివ్వున ఆకాశంలోకి ఎగిరిపోయాయి.

‘ఏ హీరో , హీరోయిన్ లు అంటే ఇష్టం... ఏ వంటలు నచ్చుతాయి?’ లాంటి విషయాలు నలభై నిమిషాలు మాట్లాడుకున్నారు.

మాటల్లో భాగంగా...

“నీ ముక్కు పుడక భలే ఉంది!” అని చెప్పినాడు వెంకటసూర్యుడు.

“చూసేవాళ్ళకి బాగుంటుంది. పడిశెం పట్టినప్పుడు చూడాలి ఆ ముక్కు... దాంతో పాటు ముక్కుపుడక బాధ”.

“మీ మీసకట్టు బాగుంది’ అని పొగిడింది శశికళ.

“చూడటానికి బాగానే ఉంటుంది. రోజూ గొరడమే ‘నస’ పని” అని పడీపడీ నవ్వినాడు.

'ఎంతసేపు మాట్లాడతారు పెండ్లి కాకుండానే...' అన్నట్లుగా మైకు నోరు మునిలక్ష్మి ఒకటికి రెండు సార్లు గట్టిగట్టిగా దగ్గింది.

'అన్నీ ఇప్పుడే మాట్లాడేస్తే పెళ్ళి అయినాక  ఏమి మాట్లాడుకుంటారు?' అన్నట్లుగా పదిమంది పిల్లల్ని కన్న పార్వతక్క ఒకటికి రెండుసార్లు పెరట్లోకి వచ్చి తొంగి చూసి వెళ్ళింది.

'కుళ్ళు బోతుల' బాధలు చూడలేక వెంకట సూర్యుడు, శశికళలు లేచి ఇంట్లోకి వచ్చేశారు.

అక్క చెంచులక్ష్మి 'పండా, కాయా' అని చెల్లిలిని అడిగింది చేతి వేళ్ళతోనే

చూసీ చూడనట్లు పడకటింట్లోకి వెళ్ళిపోయింది శశికళ.

చెంచులక్ష్మి  ముఖం వాడిన గులాబీ అయ్యింది.

అంతా చూస్తున్న సుబ్బులక్క ముఖం ఎండిన శెనగ తోట అయ్యింది.

వారంలోగా విషయం చెప్తామని చెప్పి పంపినారు పెండ్లికొడుకు దాయాదులకు.

'ఒకరికొకరు నచ్చి ఉంటేనే కదా, ఇంతసేపు మాట్లాడుకుని ఉంటారు. అంతా 'ఓకే' అవుతుందిలే!' అని లేచి ఇండ్లకు బయలుదేరినారు పార్వతక్క, మునిలక్ష్మి.

దిండులో ముఖం దూర్చి వెక్కివెక్కి ఏడుస్తున్న శశికళ పక్కన కూర్చుంది చెంచులక్ష్మి.

"నీకు పెండ్లికొడుకు నచ్చలేదా శశీ" అని అడిగింది చిన్నగా చెంచులక్ష్మి.

"నాకు టైం బాలేదు. అందుకే ఇలా జరుగుతోంది!" అని  బాధగా చెప్పింది శశికళ.

చెల్లి  దగ్గరగా   జరిగిన చెంచులక్ష్మి  "పెండ్లి కొడుకు మాటల్లో నీకు 'ముచ్చట పడితే ముద్దులు, లేకుంటే గుద్దుల బాపతుగా అనిపించాడా?  శెనిక్కాయ  గింజలో సగమంత పేస్టు వాడే రకంగా కనిపించాడా?"  అని అడిగింది.

"అదేమీ లేదు"

"పోనీ... నత్తిలాంటిది లేదుకదా పెండ్లి కొడుక్కి? చెరుకుగడ నుంచి చెరుకు వస్తుందని కూడా తెలియని టింగరోడా? " అని అడిగింది చెంచులక్ష్మి .

"అలాంటిది కూడా ఏమీ లేదు" అని బదులిచ్చింది శశికళ.

"మరి సమస్య ఏమిటో చెప్పు?"

"ఏమి చెప్పేది చెంచూ... ప్యాంటు వేయనోడైనా, పంచె కట్టేవాడైనా  ఫర్వాలేదనుకున్నాను. ఉద్యోగం వ్యాపారం లేకున్నా దండిగా సేద్యం ఉంది కదా" అని సర్దుకున్నాను. కానీ ఆయన ఈకాలం మనిషి కాదు" అని బదులిచ్చింది.

"పాత మనిషైనా ఫర్వాలేదు. మంచి అల్లోపతి డాక్టర్లకు చూపిద్దాం. మన మనిషిగా చేసుకుందాం" అని వేడుకుంది చెంచులక్ష్మి.

"కాలం ఎలా ఉందో నీకు తెలియదా చెంచూ... మిద్దె ఇల్లు కాకపోయినా ఫర్లేదు, పెంకుటిల్లైనా సర్దుకుందా మనుకున్నాను. స్కూటర్ లేకపోయినా ఫర్లేదు, ట్రాక్టర్ ఉంది కదా అనుకున్నాను. మంచి చెడ్డలు మాట్లాడుకునేదానికి నా సెల్ నెంబర్ ఇచ్చి ఆయన సెల్ నెంబర్ అడిగినాను" అని చెప్పి ఆపింది.

"దానికి కోప్పడినాడా ఏంది?"

కుళాయి తిప్పితే నీళ్ళు వచ్చినట్లు మళ్ళీ ఏడ్చింది శశికళ.

"చిట్టి చెల్లెలా... ఏడవబాకే... శుభం జరగాల్సిన చోట వేదనా రాగాలు పాడకూడదు. కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుని జరిగింది చెప్పు"

గుండె దిటవు చేసుకున్న శశికళ "గ్రీకు వీరుడు అక్కరలేదు, రాజకుమారుడు అవసరం లేదు. తక్కువలో తక్కువ సెల్ ఉండే మొగుడు కూడా దొరకడం లేదు నాకు.

ఆయన దగ్గర సెల్ లేదంట. ఇంకా కొనలేదంట. ఎలా వాడాలో తెలియదంట" అని భోరుమని ఏడ్చింది.

'ఈకాలంలో కూడా ఇట్టాంటోళ్ళు ఉన్నారా...' అని బాంబు పడినట్లు ఉలిక్కిపడింది చెంచులక్ష్మి.

ఆమె మనసు క్షణం పాటు అల్లా ఉద్దీన్ అద్భుత ద్వీపం సినిమాలో సీసాలో ఇరుక్కున్న ప్రాణంలా గిలగిలా కొట్టుకుంది.

అంతా విన్న చెంచులక్ష్మి మొగుడు నల్లమరాజు పెళ్ళాం చెవిలో 'ఏదో' ఊదినాడు. మొగుడి తెలివికి కుషీ అయిన చెంచులక్ష్మి 'బావ తెలివి'ని శశికళ చెవిలో పడేసింది.

'కష్టాల్లో కాపాడటానికి నువ్వు తప్పితే నాకు ఇంకెవరు ఉన్నారు బావా' అన్నట్లుగా బావ వైపు చూసిన శశికళ అలాగేనని 'ఊ' కొట్టింది.

మరదలి దగ్గర మార్కులు కొట్టినందుకు పొట్టి మీసాలను నాలికతోనే తడి చేసినాడు.

కూతురు శశికళ మళ్ళీ అడ్డుపుల్ల ఏదో వేస్తోందని సుబ్బులక్కకు భయమేసింది. ఆమె మనసు పగిలిన గాజు పెంకుల మీద నడిచినట్లయ్యింది. 'ఈ సంబంధం కూడా కొండెక్కుతుందేమో... ఏమి చేసేదిరా భగవంతుడా!' అని వీధిలోకి వచ్చింది. నడివీధి గంగమ్మకు పడీపడీ దండం పెట్టింది. గంగమ్మ ముందర ఉన్న కుంకుమ నుదిటిన పెట్టుకుని ఇంటికి వచ్చింది.

ఇంతలో శశికళ నవ్వుతూ కనిపించింది.

"పండా పండా..." అంటూ పెద్ద కూతురు చెంచులక్ష్మిని అడిగింది సుబ్బులక్క.

'పండే' అని ఊగుతూ ఊగుతూ చెప్పినాడు అల్లుడు నల్లమరాజు. ఎండిన సొరకాయ బుర్ర మాదిరి తేలికయ్యింది సుబ్బులక్క మనసు.

'ఏమి మాయ చేసినావే...' అని చెంచులక్ష్మికి షేక్ హ్యాండ్ ఇచ్చింది సుబ్బులక్క. అల్లుడి చేతికి రెండు నల్ల ఖర్జూరాలు ఇచ్చింది.

'అత్త ఇచ్చింది ఏదైనా బంగారమే కదా' అని నోట్లో వేసుకున్నాడు నల్లమరాజు

XXXXXXX

కాణిపాకం గుడి ముందర పెళ్ళి.

పట్టు గుడ్డలు కట్టిన వెంకట సూర్యుడు, శశికళ సినిమాల్లో హీరో హీరోయిన్ లా ఉన్నారు.

ఐరాల వాద్యగాళ్ళు ఎగిరెగిరి మేళం వాయిస్తున్నారు. అరగొండ అయ్యోరు మంత్రాలు చదువుతూ ఉన్నాడు.

ఎడమచేతి వాచీ చూసి చెంచులక్ష్మి, 'ముహూర్త ఘడియలు దగ్గర పడుతున్నాయని' అయ్యోరికి చెప్పింది.

అయ్యోరు కూడా వాచీ చూసుకుని వెంకట సూర్యుడి చేతికి తాళి అందించాడు.

మేళగాళ్ళు 'పెళ్ళి మేళం' కొట్టినారు.

శశికళ అతి కష్టం మీద ముఖంలోకి సిగ్గు తెచ్చుకుంది. అయినా తల కొంచం కూడా దించలేదు.

'వంగకపోతే నీ మొగుడు తాళిఎట్ల కడతాడే?' అని మనసులో అనుకుంది సుబ్బులక్క.

చేతిలోని తట్టని పిల్లోల్ల చేతికి ఇచ్చి శశికళ మెడని కొంచెం వంచింది.

వెంకట సూర్యుడు మెరుపు ముఖంతో 'ఆలసించిన ఆశాభంగం' అన్నట్లుగా గబగబా తాళి కట్టినాడు. మేళగాళ్ళు 'దుండుంలు' మరింత గట్టిగా కొట్టినారు.

వచ్చిన ఊర్లో వాళ్ళు, దాయాదులు అక్షింతలు చల్లినారు.

కువైట్ నుంచి వచ్చిన సుబ్బులక్క మొగుడు జీవరత్నం అందరికీ కువైట్ చాక్లెట్లు పంచినాడు.

అప్పుడు...

చిన్నగా బ్యాగులో నుంచి చెంచులక్షి మొగుడు నల్లమరాజు రంగురంగుల పెట్టెని శశికళ చేతికి ఇచ్చినాడు. అప్పుడు మెరిసింది నూరు నూనె దీపాల వెలుగుతో శశికళ ముఖం.

పెట్టెకి కట్టిన రిబ్బను తీసి మిలమిల మెరిసే పాతిక వేల సెల్ ని మురిపెంగా చూస్తూ మొగుడు వెంకట సూర్యుడి చేతికి కానుకగా ఇచ్చింది.

'దొరుకునా ఇటువంటి బుల్లి తెరల డబ్బా' అని భుజాలు ఎగరేస్తూ అందుకున్నాడు.

పెళ్ళి బట్టలతోనే సెల్ఫీ తీసుకున్నారు ఆ కొత్త సెల్ తో.

అందరూ దర్శనానికి గుడిలోకి వెళ్ళారు.

'హమ్మయ్య, ఇన్నాళ్ళకు శశికళ పెళ్ళయ్యింది. 'నాలా బ్రహ్మచారి బతుకు తప్పింది' అన్నట్లుగా బొజ్జ గణపతి కొత్త దంపతులను చూసి నవ్వుతున్నట్లుగా ఉన్నాడు.

★★★★★★

COMMENTS